క్లుప్తంగా

పాత వస్తువుల తొలగింపు



పార్కులోని పాత వస్తువులు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ ఎస్సీ కాలనీలో గల అంబేడ్కర్ జీవీఎంసీ పార్కులోని పాత వస్తువుల బస్తాలు తొలగించి స్క్రాప్ వ్యాపారికి జరిమానా వేశారు. ఇక్కడి పార్కు ఆకతాయిలకు, మందుబాబులకు, స్క్రాప్ వ్యాపారులకు అడ్డాగా మారింది. దీంతో ఇక్కడ వాకింగ్ చేసుకునేందుకు సీనియర్ సిటిజన్లు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై సాక్షి పత్రికలో శనివారం ప్రచురించిన 'ఇలా అయితే ఎలా' అనే వార్తకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. పార్కులోని మద్యం సీసాలు, వాటర్ బాటిళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించారు. మరలా ఇక్కడ పాత వస్తువులు నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

ఆలయ వార్షికోత్సవం నేడు

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడలో గల శ్రీ వరసిద్ధి వినాయక, శ్రీ భూ సమేత వేంకటేశ్వరస్వామి, శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ 19వ వార్షికోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా హోమాలు, అభిషేకాలతోపాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.


క్యాంపస్ డ్రైవ్‌లో 27 మంది ఎంపిక



క్యాంపస్ డ్రైవ్‌లో ఎంపికైన విద్యార్థులు

తగరపువలస : స్థానిక శ్రీబాసర డిగ్రీ కళాశాలలో శనివారం హెటిరో ఫార్మసీ సంస్థ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 27 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 50 మంది ఈ డ్రైవ్‌లో పాల్గొన్నట్టు హెచ్‌ఆర్ మేనేజర్లు నరేష్, రాజు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్, ప్రిన్సిపాళ్లు చొప్పా సురేష్, మజ్జి భాస్కరరావు, ఏవో కేశవ, అధ్యాపకులు అభినందించారు.

వంతెన రెయిలింగ్ శిథిలం



రెయిలింగ్ శిథిలం కావడంతో కనిపిస్తున్న ఇనుప ఊచలు

పద్మనాభం : పద్మనాభం సమీపంలోని గోస్తనీ నదిపై ఉన్న వంతెన రెయిలింగ్ శిథిలమై ప్రమాదకరంగా మారింది. ఈ వంతెన పైనుంచి సింహాచలం, విజయనగరం, విశాఖపట్నం వెళ్లే బస్సులు, ఆటోలు, లారీలు, ద్విచక్ర వాహనాలు నిరంతరం రాకపోకలు సాగిస్తుంటాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా ఈ వంతెన పైనుంచే రాకపోకలు సాగిస్తూంటారు. హుద్‌హుద్ తుఫాన్ సమయంలో వంతెనకు ఇరువైపులా ఉండే రెయిలింగ్ శిథిలమై ఇనుప ఊచలు కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల అయితే పూర్తిగా లేనే లేదు. డ్రైవర్లు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా వాహనాలు అదుపు తప్పి నదిలోకి పల్టీకొట్టే ప్రమాదం ఉంది. పాదచారులు, విద్యార్థులు గోస్తనీ నది అందాలు తిలకించేటప్పుడు అందులోకి పడిపోయే ప్రమాదం వుందని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి రెయిలింగ్ పునర్నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మురుగు ప్రవాహానికి ఆటంకాలు

- డ్రైనేజీలు శిథిలం కావడంతో ఇబ్బందులు



మటన్ దుకాణం ఎదురుగా డ్రైనేజీలో నిలిచిన మురుగు



వర్షం కురిస్తే డ్రైనేజీ నిండి గేటు లోపలికి వెళ్లేంతగా నిలిచిపోయిన మురుగునీరు



పూడుకుపోయిన డ్రైనేజీలో నిలిచిన మురుగు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు కొత్తపేట చావుల మదుము రహదారిలో ఇరుకైన, శిథిలమైన డ్రైనేజీలు తరచూ ముంపునకు గురవుతున్నాయి. దీంతోపాటు ఈ డ్రైనేజీలు ఆక్రమణకు గురవడంతో మురుగునీటి ప్రవాహానికి తరచూ ఆటంకం కలుగుతోంది. చెత్త అడ్డం పడినప్పుడు మురుగునీరు డ్రైనేజీలను ఆనుకుని ఉన్న ఇళ్లలోకి ప్రవేశిస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిట్టివలస పంచాయతీగా ఉన్నప్పుడు నిర్మించిన డ్రైనేజీలు ఇప్పటి వరకు ఆధునికీకరణకు నోచుకోలేదు. కానీ ఈ మార్గంలో నివాసాల సంఖ్య పెరగడం, చిట్టివలస పంచాయతీ కాస్తా ముందు భోగాపురం సమితి, తర్వాత భీమిలి మున్సిపాల్టీ, ప్రస్తుతం జీవీఎంసీలో కొనసాగుతోంది. అయినప్పటికీ పాత డ్రైనేజీల స్థానంలో కొత్తవి ఎవరూ నిర్మించలేదు.

వర్షం కురిస్తే చచ్చేంత తంటా..

సాధారణ రోజుల్లో ఎలా ఉన్నా వర్షం కురిస్తే మాత్రం ఈ మార్గంలో డ్రైనేజీని ఆనుకుని నివసిస్తున్న కుటుంబాలకు చచ్చేంత బాధ అనిపిస్తోంది. చిట్టివలస గణేష్ థియేటర్ వైపు నుంచి సరైన డ్రైనేజీలు లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే ఇళ్లను మురుగు ముంచెత్తుతోంది. ఈ మురుగును బయటకు పంపించడానికి స్థానికులు ఎంత కష్టపడినా



కొత్తపేట చావుల మదుము రోడ్డులో మూసుకుపోయిన డ్రైనేజీ

ప్రయోజనం ఉండడం లేదు. ఈ మార్గంలోని డ్రైనేజీలను విస్తరించి జ్యూట్‌మిల్లు వైపు మురుగు ప్రవహించేలా చూడాలని కొత్తపేట వాసులు కోరుతున్నారు. అంతేకాకుండా అప్పటి వరకు రోజూ పారిశుధ్య సిబ్బంది ఈ డ్రైనేజీలను శుభ్రం చేసేలా జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని వీరు కోరుతున్నారు.

'అవంతి'లో ముగిసిన వర్క్‌షాప్



సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ డీజీఎం సత్యప్రసాద్

తగరపువలస : చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగంలో బీఎస్ఎన్ఎల్ – విశాఖ సహకారంతో వైర్డు యాక్సెస్ నెట్‌వర్క్‌పై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఆప్టికల్ ఫైబర్ కమ్యూనికేషన్, కస్టమర్ ప్రెమిసెస్ పరికరాలపై రిసోర్స్‌పర్సన్, బీఎస్ఎన్ఎల్ డీజీఎం ఎం.సత్యప్రసాద్ వివరించారు. నైపుణ్యాభివృద్ధిలో బీఎస్ఎన్ఎల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఎలాంటి కీలకపాత్ర వహిస్తుందో వివరించారు. 5జీ సాంకేతికతకు సైబర్ ఆప్టిక్ కమ్యూనికేషన్ ఎలా ఉపయోగపడుతుందో తెలియజేశారు. వైర్డు యాక్సెస్ పరికరాలు పని చేసే విధానాన్ని నిపుణులు చూపించారు. విద్యావేత్తలు, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడానికి ఇలాంటి వర్క్‌షాప్‌లు దోహదపడతాయని కళాశాల ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ తెలిపారు. పరిశ్రమలలో డిమాండ్‌కు తగిన విధంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని కళాశాల డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్ తెలిపారు. కమ్యూనికేషన్‌లో ఇటీవల జరిగిన నూతన సాంకేతిక అభివృద్ధిని వివరించారు. ఈసీఈ విభాగాధిపతి వి.శివభాస్కరరావు, 72 మంది అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలోని సంగివలస శశి విద్యాసంస్థలు, రామన్నపేట సాయి రవీంద్ర పాఠశాలలను భీమిలి ఎంఈవో ఎం.శివరాణి శనివారం తనిఖీ చేశారు. ఈ పాఠశాలల్లో ఆమె రిజిస్టర్లు, రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు, హాజరుపట్టికలు పరిశీలించారు. తరగతి గదులు, టాయిలెట్లు పరిశీలించి యాజమాన్యాలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులకు కల్పిస్తున్న అదనపు వసతులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా పాఠశాలల్లో అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాల వివరాలు తెలుసుకున్నారు.

నేడు నృత్య ప్రదర్శన

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం నగరానికి చెందిన జ్యోష్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందని స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథ రెడ్డి తెలిపారు. ఆసక్తి గల వారు హాజరవ్వాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అల్లిపురం : చావుల మదుము జంక్షన్‌లో గల బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలోని ఓ పెద్ద కాలువలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం వెలుగుచూసింది. పోలీసులు అందించిన సమాచారం మేరకు సుమారు 45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి కాలువలో పడి వున్నట్లు స్థానికులు గుర్తించారు. అతని వివరాలు తెలియకపోవడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కాలువలో నుంచి మృతదేహాన్ని వెలుపలకు తీశారు. వివరాలు తెలిసిన వారు 9440904716, 0891 2783672, 7981674667లో సంప్రదించాలని కోరారు.

డెబ్రిస్ డంప్‌తో దుర్వాసన



బంగ్లామెట్ట శివాలయం ఎదురు స్థలంలో డంప్ చేసిన డెబ్రిస్, చెత్త

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట శివాలయం ఎదురుగా గోస్తనీ నది తీర మార్గాన్ని కొందరు డంపింగ్ యార్డుగా మార్చేస్తున్నారు. ఇతర ప్రాంతాల వ్యక్తులు లోడుల కొద్దీ చెత్త, డెబ్రిస్ తీసుకొచ్చి ఇక్కడే డంప్ చేస్తున్నారు. గోస్తనీనదిలో ఊడ్చిన ఉప్పు ఇసుకను ఈ ప్రాంతంలోనే కల్తీ చేసి విక్రయిస్తుంటారు. అలాగే తగరపువలస ప్రాంతంలో అనధికారంగా విక్రయించే పశుమాంసం కోసం మూగజీవాలను ఇక్కడే వధిస్తుంటారు. ఈ మార్గం ద్వారా శ్మశానవాటిక, గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేసే బోర్లు ఇక్కడే ఉన్నాయి. అలాగే ఇదే ప్రాంతంలో ఆర్టీసీ కాంప్లెక్స్, డిపో నిర్మాణానికి 2009 నుంచి ప్రతిపాదనలు, భూమి పూజ జరుగుతున్నాయి. ఈ స్థలాన్ని ఆనుకుని రెండు బేకరీలకు చెందిన వ్యర్థాలు ఇక్కడే వదులుతున్నారు. ఇటీవల ఇక్కడి ఖాళీ ప్రదేశాన్ని ఆనుకుని బస్ షెల్టర్ నిర్మించారు. ఇక్కడ బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు డెబ్రిస్, చెత్త నుంచి దుర్వాసన భరించలేకపోతున్నారు. ఈ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

సమ్మర్ టాలెంట్ షో అదుర్స్



విజేతలతో నృత్య శిక్షకుడు అరుణ్ సాయి

సీతంపేట: సాయినాథ కళా సమితి ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయం నిర్వహించిన సమ్మర్ టాలెంట్ షో ఆద్యంతం అలరించింది. సుమారు 40 మంది చిన్నారులు పాల్గొని వెస్ట్రన్, క్లాసికల్ డ్యాన్సులతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కళా సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ అరుణ్ సాయికుమార్ మాట్లాడుతూ 24 ఏళ్లుగా ఆర్ అండ్ బీ వద్ద గల తమ సంస్థలో వెస్ట్రన్, క్లాసికల్, క్లాసికల్ మ్యూజిక్, మెడిటేషన్‌లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఏటాలాగే ఈ సారికూడా వేసవి సంగీత నృత్య శిక్షణ శిబిరం నిర్వహించామన్నారు. నెల రోజుల పాటు శిక్షణలో నేర్చుకున్న అంశాలపై పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు, జ్ఞాపికలు, ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డ్యాన్సర్ రాజు, నాట్యాచారుడు లలిత్ కుమార్ గుప్తా, అతిథులు చల్లా మంజుల, సూర్యకళ పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



సినీ గీతాలు ఆలపిస్తున్న గాయకులు

సీతంపేట: స్వర రాగం అండ్ మెలోడి ఫ్యూజన్ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆహుతులను ఉర్రూతలూగించింది. సంస్థ వ్యవస్థాపకులు ఎస్.రమేష్, ఎస్.ఎస్.రావు ఆధ్వర్యంలో పలువురు గాయనీ గాయకులు పాత సినిమాల్లోని హిట్ సాంగ్స్ మధురంగా ఆలపించి అలరించారు. రెండు గంటల పాటు సాగిన సంగీత విభావరి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది.

చుక్కల జింకల సందడి



కంబాలకొండ రోడ్డు పక్కన పచ్చిక మేస్తున్న చుక్కల జింకలు

ఆరిలోవ: కంబాలకొండ రిజర్వుడ్ ఫారెస్ట్‌లో కుప్పలుగా జింకలు ఉన్నాయి. సహజసిద్ధమైన అటవీ ప్రాంతం కావడంతో కొండకోనల్లో ఇవి గుంపులుగా తిరుగుతూ కంబాకొండ ఎకో టూరిజం పార్కులోకి చేరి సందర్శకులను అలరిస్తున్నాయి. కొండల నుంచి బయటకు వచ్చిన చుక్కల జింకలు ఇక్కడ ఎక్కువగా తిరుగుతుంటాయి. గంపులుగా కంబాలకొండ కొను వద్దకు చేరుకొని దానిలో నీరు తాగి దాహం తీర్చుకొంటాయి. అనంతరం అన్నీ కలసి మేత కోసం పరుగులెడుతుంటాయి. ఇవి పార్కు లోపల నుంచి జాతీయరహదారిపైకి పచ్చిక మేత కోసం తరుచూ వస్తున్నాయి. చెంగుచెంగున గెంతులు వేస్తూ రహదారిపై వెళుతున్న వాహనచోదకులను కనువిందు చేస్తున్నాయి. కంబాలకొండ పార్కు ముఖ ద్వారం పక్కన ఎక్కువగా ఇవి తిరుగుతూ కనిపిస్తున్నాయి. ఇలా కొండల నుంచి బయటకు వస్తున్న జింకలు రోడ్డుపై వెలుతున్న వాహనాల శబ్దాలకు బెదిరిపోయి ఒక్కోసారి గాబరాతో పరుగులు తీస్తున్నాయి. ఆ క్రమంలో ఎటు వెళ్లాలో తెలియక రోడ్డు మీద ప్రయాణించే వాహనాలకు అడ్డంపడి ప్రాణాలు కోల్పోతున్నాయి. గతంలో పలుసార్లు కంబాలకొండ, జూ పార్కు సమీపంలో జాతీయ రహదారిపై పలు జింకలు, అడవి పందులు వాహనాలకు అడ్డంపడి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇవి రోడ్డు మీదకు చేరడానికి వీలులేకుండా అటవీశాఖ అధికారులు బలమైన కంచె ఏర్పాటు చేస్తే వాటి ప్రాణాలకు రక్షణ కలుగుతుందని వన్యప్రాణి ప్రేమికులు భావిస్తున్నారు.

సాగరతీర స్వచ్ఛతలో ఏయూ విద్యార్థులు



బీచ్ క్లీనింగ్ కార్యక్రమం ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూక్యాంపస్: ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థులు బీచ్‌క్లీన్ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం 6 గంటలకు ఆర్‌కె బీచ్ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం 8 గంటలకు వైఎంసీఏ వద్ద ముగిసింది. కార్యక్రమంలో ఏయూ విద్యార్థులు, ఎన్‌సీసీఆర్, సీఎంఎఫ్‌ఆర్‌ఐ, సీఐఎఫ్‌టీ శాస్త్రవేత్తలు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ప్రారంభించారు. కార్యక్రమంలో సమన్వయకర్త ఆచార్య పి.జానకీరామ్ తదితరులు ప్రసంగించారు. 250 మందికిపైగా వలంటీర్లు పాల్గొని బీచ్‌లో వ్యర్థాలను ఏరివేసి పారిశుధ్య సిబ్బందికి అందజేశారు.

మార్మోగిన గోవింద నామస్మరణ



శ్రీవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతోపాటు, సెలవు రోజు కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీవారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. వేకువజామున సుప్రభాత సేవ, తోమాల సేవ, అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ముందుగా శ్రీవారి పాదాల వద్ద మహిళలు పసుపు, కుంకుమ సమర్పించారు. అనంతరం మహాలక్ష్మి, గోదాదేవిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కోలాటాలు, శ్రీవారి నామసంకీర్తన భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

- శ్రీవారి ఆలయంలో రెండో శనివారం కావడంతో లడ్డూ విక్రయాలు జోరుగా సాగాయి. 750 గ్రాముల కళ్యాణ లడ్డూ రూ.200, 140 నుంచి 170 గ్రాముల బరువు గల సాధారణ లడ్డూ రూ.50లకు భక్తులకు విక్రయించారు. ఇక్కడ కూడా భక్తులు బారులు తీరారు.

బాలికలకు వరం.. బాలసదనం



వసతి గృహం లోపల విశాల ప్రాంగణం



బాల సదనం వసతి గృహం

- ప్రవేశాలకు 12లోగా దరఖాస్తు చేసుకోవాలి

భీమునిపట్నం: అనాథ, నిరుపేద బాలికలకు భీమిలిలోని బాల సదనం వసతి గృహం వరంలా మారి ఆదుకుంటోంది. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వసతి గృహంలో ఒకటో నుంచి ఐదో తరగతి వరకు తల్లిదండ్రులను కోల్పోయిన వారు, తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు, నిరుపేదలు, దివ్యాంగుల పిల్లలకు కుల, మతాలతో సంబంధం లేకుండా ప్రవేశం కల్పిస్తారు. ఇందులో 30 ఖాళీలు ఉండగా ఈ నెల 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక్కడ చేరే వారిని సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి బాలసదనంలో వసతి, భోజన సదుపాయం కల్పిస్తారు. బాలసదనంలో చేరి చదువుకునే పిల్లలకు విశాలమైన ప్రాంగణంతోపాటు మంచి గదులు, అందులో మంచాలు ఉంటాయి. బాలికలకు దుస్తులు, పౌడర్ డబ్బాలు, సబ్బులు, ఇతర అవసరాలకు సంబంధించినవి అందిస్తారు. అలాగే విజ్ఞానానికి సంబంధించిన చక్కని పుస్తకాలతో చిన్న గ్రంథాలయం, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్ ఆడుకునే సదుపాయం ఉంది. ఇక్కడ యోగా కూడా నేర్పుతారు. బాలసదనంలో సూపరింటెండెంట్‌తోపాటు మ్యాట్రిన్, హెల్పర్, స్టోర్ కీపర్, హౌస్ కీపర్, ఎడ్యుకేటర్, యోగా టీచర్, ఇతర సిబ్బంది ఉన్నారు. వీరంతా పిల్లలను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తారు. ఇక్కడ చేరాలనుకునే వారు పూర్తి వివరాల కోసం బాలసదనం సూపరింటెండెంట్ కె.ప్రమీలను 7893514460లో సంప్రదించవచ్చు.

ప్రమాదకరంగా మెట్ల మార్గం



శిథిలమైన మెట్లు, రాళ్లకు అడ్డంగా పైప్‌లైన్లతో బంగ్లామెట్ట పైకి మార్గం

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట నుంచి బైపాస్ రోడ్డులోని పోలీస్ ఓపీ వైపు మార్గంలో మెట్లు శిథిలం కావడంతో రాకపోకలు సాగించడానికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇరవై ఏళ్ల క్రితం భీమిలి మున్సిపాల్టీ పాలకవర్గం నిర్మించిన ఈ మెట్ల మార్గం సిమెంట్ ఊడిపోయి, ఇటుకలు అరిగిపోయి నాచుపట్టి కనిపిస్తుంది. ఈ మార్గాన్ని ఆనుకుని డ్రైనేజీ కూడా శిథిలమై నాచుకట్టి ప్రమాదకరంగా కనిపిస్తోంది. వర్షాకాలం ప్రారంభం కావడంతో ప్రమాదకరంగా నాచుకట్టి ఉన్న ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి వీలుపడడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జారి పడితే ప్రాణాలకే ప్రమాదం వాటిల్లుతుందని భయపడుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి బంగ్లామెట్ట చుట్టూ శిథిలమైన మెట్ల మార్గాలను ఆధునికీకరించాలని కోరుతున్నారు.

నేత్ర పర్వం.. అప్పన్న నిత్య కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణం తిలకిస్తున్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అర్చకులు అధిష్టంపజేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో స్వామివారి నిత్యకల్యాణాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు. అనంతరం ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

సిరుల తల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళాల నడుమ అమ్మవారు

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో కొలువుదీరిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. అమ్మవారికి ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొన దలచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి పి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చన్నారు. కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులరెడ్డి, కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు పాల్గొన్నారు.